## 28

# దొంగల్లో నిజాయితీపరుడు

సింధు దేశంలో 'చందు' అనే గజదొంగ ఉండేవాడు.

అతడు దొంగతనాలు చేయని ఊరూ, వాడా అంటూ లేవు. అతడి పేరు వింటేనే ధనికులు భయంతో గజగజలాడేవారు. చందూకి వున్న మరో విశేషమేమిటంటే... అతడికి పక్షుల భాషలు, జంతువుల భాషలు కూడా వచ్చు. అందువల్ల అవి కూడా అతడికి సహకరిస్తుండేవి.

ఇలా వుండగా... పొరుగున వున్న లక్షణ రాజ్యానికి 'చతురుడు' అనేవ్యక్తి రాజు అయ్యాడు.

పేరుకి తగ్గట్లుగా చతురుడు ఎంతో తెలివైన వాడు. ఎటువంటి సమస్యనైనా అవలీలగా పరిష్కరించ గలిగినవాడు.

రాజ్యానికి రాగానే అతడు పరిపాలనను కట్టుదిట్టం చేశాడు. ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించేటట్లు చేశాడు. దీని మూలంగా రాజ్యంలో అవినీతికాని, దొంగతనాలు కాని ఎక్కడా జరగడంలేదు. దొంగలు తమ వృత్తి మానేసి గౌరవంగా బ్రతకసాగారు. అలా చేయలేని వారు దేశం వదిలి వెళ్లారు. నలుమూలలా లక్షణరాజ్యం గురించి, చతురుడి పరిపాలన గురించి అందరూ గొప్పగా చెప్పుకోసాగారు.

చతురుడి రాజ్యంలో దొంగతనాలు లేవన్న విషయం చందూ చెవిన పడింది.

'అటువంటిచోట దొంగతనం చేస్తేనే... తన ప్రజ్ఞకి నిజమైన గుర్తింపు!' అని అనుకొని లక్షణ రాజ్యంలో దొంగతనాలు చేయడానికి బయలుదేరాడు చందూ.

దారిలో ఆ రాజ్యానికే పోతున్న ఒక వ్యాపారి కలిశాడు. ఇద్దరూ వెళ్లేది ఒకే చోటికి కావడంతో ఇద్దరికీ మాటలు కలిశాయి. తాను ఎవరైనదీ, ఎందుకు వెళ్తున్నదీ చెప్పాడు చందు. అతడి పేరు వినగానే పెనుగాలిలో ఆకులా గిలగిల లాడిపోయాడు వ్యాపారి.



అది చూసి, "భయపడకు ! చందూ ఎప్పుడూ మిత్రద్రోహం చేయడు. నిన్ను నా మిత్రుడిగా భావిస్తున్నాను కనుక... నువ్వు నిర్భయంగా ఉండవచ్చు" అన్నాడు చందు.

వ్యాపారి ప్రాణం కొంచెం కుదుట పడింది.

కొంచెం దూరం వెళ్లేసరికి.., చెట్టు మీద నుండి పాలపిట్ట ఒకటి ఎగురుతూ వచ్చి చందు చుట్టూ తిరుగుతూ కిచ కిచ లాడసాగింది. చందు కూడా అదే విధంగా శబ్దాలు చేయసాగాడు. కొంచెం సేపట్లో ఆ పిట్ట ఎగిరి పోయింది.

అది చూసి ఆశ్చర్యంతో "నీకు పక్షి భాష వచ్చా?" అని అడిగాడు వ్యాపారి.

"అవును..!" అన్నాడు చందు.

"దాంతో ఏమి మాట్లాడావు?" అని మళ్ళీ అడిగాడు వ్యాపారి కుతూహలంతో.

"వ్యాపారి గాడిద మీద వేసిన సరుకుల సంచిలో అడుగున నూరు బంగారు నాణాలు దాచాడు. వ్యాపారిని కొట్టి వాటిని తీసుకో!' అని పిట్ట చెప్పింది. కాని, 'చందూ ఎప్పుడూ మిత్రదోహం చేయడు!' అని చెప్పాను" అన్నాడు చందూ.

ఆ మాట వినగానే గుండె ఝల్లుమంది వ్యాపారికి.

అతడు నిజంగానే ఆ బంగారు నాణాలు సంచిలో దాచాడు. పైకి ఏమీ కనిపించ నీయక పోయినా... చందూ ఏమి చేస్తాడోనన్న అనుమానం పీకుతుండడంతో సమయం చూసి, చందూ చూడకుండా నాణాలను తీసి గుడ్డలో పెట్టి తన నడుం చుట్టూ కట్టుకున్నాడు.

మరికొంత దూరం వెళ్లేసరికి పొదలలో నుండి ఒక నక్క తల బయటకు పెట్టి ఊళపెడ్తూ రకరకాలుగా కూసింది. చందు కూడా అదే విధంగా కూతలు కూశాడు. ఆ నక్క కొంచెంసేపటికి తిరిగి పొదల్లోకి వెళ్లిపోయింది.

"నీకు నక్క భాష కూడా వచ్చినట్లుందే! ఈసారి అది ఏమని చెప్పింది?" అని అడిగాడు వ్యాపారి, భయం భయంగా.

"నువ్వు మిత్రుడిగా భావించినా... వ్యాపారి నిన్ను నమ్మడం లేదు. అందుకే బంగారు నాణాలు తీసి నడుం చుట్టూ కట్టుకున్నాడు. అతడిని చంపి నాణాలు తీసుకో!' అని సలహా చెప్పింది నక్క. కాని, నేను 'నా మిత్రుడు నన్ను నమ్మకపోయినా– నేను నమ్మాను.., చందు ఎప్పుడూ మిత్రద్రోహం చేయడు!' అని చెప్పాను" అన్నాడు చందు.

ఆ మాటలకు సిగ్గుతో తల వంచుకున్నాడు వ్యాపారి. తన పొరపాటుకు క్షమాపణ వేడుకున్నాడు. ఆ తర్వాత... ఇద్దరూ అరమరికలు లేకుండా మాట్లాడుకోసాగారు.

కొద్దిరోజులకు వారు లక్షణ రాజ్యం చేరుకున్నారు. చందు విషయం ఎవరికీ చెప్పనని మాటిచ్చి సెలవు తీసుకున్నాడు వ్యాపారి.

చందు వెళ్ళి బాటసారిలాగా ఒక సత్రంలో బస చేశాడు.

చందూకి మాట ఇచ్చాడేకాని, వ్యాపారి మనసులో దుర్బుద్ధి కలిగింది.

'చందు వంటి గజదొంగ ఆచూకీ తెలియజేస్తే చతురుడు ఎంతో సంతోషించి తనని ఘనంగా సత్కరిస్తాడు' అని భావించి వెంటనే అతడి దగ్గరకు వెళ్ళాడు.

"ప్రభూ! దేశదేశాలూ గడగడ లాడించిన గజదొంగ చందూ ఇప్పుడు మన రాజ్యంలో వున్నాడు" అంటూ జరిగింది చెప్పాడు వ్యాపారి.

అది విని చతురుడికి కోపం వచ్చింది.

"దుర్మార్గుడా! నిన్ను నమ్మి నీతో నిజమైన స్నేహభావంతో వున్న మిత్రుడికి ద్రోహం చేస్తావా?" అని చివాట్లు పెట్టి, ఏది ఏమైనా చందూ ఆచూకీ చెప్పినందుకు కొద్దిగా కానుకలు ఇచ్చి పంపించాడు.

చందు గురించి అంతకుముందే బాగా విని వున్నాడు చతురుడు.

ఇప్పుడు అతడి ఔదార్యం, మిత్రభావం గురించి తెలుసుకునేసరికి – అటువంటి వ్యక్తితో తాను స్వయంగా తలపడాలని, అతడిని కలుసుకోవాలని ఉవ్విళ్ళూరాడు.

ఒక రాజోద్యోగిగా వేషం వేసుకుని, చీకటి పడ్డాక నగరవీధుల్లో తిరగసాగాడు చతురుడు.

చందు కూడా తన పనిమీద బయలు దేరాడు. కొంచెంసేపటికి మారువేషంలో వున్న చతురుడు అనుమానాస్పదంగా తిరుగుతూ చందుకి కంటబడ్డాడు.

వెంటనే చందు అతడి మీద కలియబడి, "నువ్వు ఎవరైనదీ నిజం చెప్పు?" అంటూ గద్దించాడు.

అతడే చందు అయివుంటాడని గుర్తించాడు చతురుడు. పైకి భయం నటిస్తూ "నేనొక దొంగని. దొంగతనాలు చేస్తూ బ్రతుకుతుండేవాడిని. అయితే... ఈ చతురుడు రాజ్యానికి వచ్చినప్పటి నుండీ, నా నోట్లో దుమ్ము పడింది. ఈ రోజు ఒక వ్యాపారి ద్వారా పేరుమోసిన దొంగ చందు ఈ రాజ్యానికి వచ్చినట్లు తెలిసింది. అతడిని కలిస్తే నాకో దారి చూపిస్తాడేమోనన్న ఆశతో ఇలా తిరుగుతున్నాను" అన్నాడు.

ఆ మాటలకు చందు సంతోషించి, "భయపడకు! ఆ చందూని నేనే! నీకు సహాయం చేస్తానని మాట ఇస్తున్నాను. ఈ రోజు నుండి మనం స్నేహితులం. చందు ఎప్పుడూ మిత్రద్రోహం చేయడు. నాకు ఈ రాజ్యం కొత్త కనుక – ఎక్కడ దొంగతనం చేస్తే అనువుగా వుంటుందో చూపించు" అన్నాడు.

నగరంలోకెల్లా అతి ధనవంతుడైన వ్యాపారి ఇంటికి చందూని తీసుకువెళ్ళాడు చతురుడు.

చతురుడిని బయట కాపలా వుంచి, నేర్పుగా ఇంట్లోకి ప్రవేశించాడు చందు.

లోపల... బాన కడుపుతో వున్న ఆ వ్యాపారి- ఖాతా పుస్తకాలు ముందు వేసుకుని తల కొట్టుకుంటూ పదే పదే లెక్కలు సరిచూసుకుంటున్నాడు. ప్రక్కన డబ్బు రాశులుగా వుంది. దానిని మళ్ళీ మళ్ళీ లెక్కలు చూస్తున్నాడు.

ఇంతలో... వ్యాపారి భార్య వచ్చి "అర్థరాత్రి అయింది. ఇంకా అన్నానికి ఎప్పుడు వస్తారు? " అని అడిగింది.

"లెక్కల్లో ఒక పైసా తేడా వస్తోంది. సాయంత్రం నుండీ చూస్తున్నాను... అయినా దొరకలేదు. అది తేలందే అన్నానికి రాను! నీళ్ళు కూడా త్రాగను " అంటూ మళ్ళీ డబ్బు లెక్క పెట్టసాగాడు వ్యాపారి.

అది చూసి వట్టి చేతులతోనే బయటకు వెళ్లిపోయాడు చందు.

"ఏమి మిత్రమా... వట్టి చేతులతో వచ్చావు?" అని అడిగాడు చతురుడు ఆశ్చర్యంతో.

వ్యాపారి ఇంట్లో తాను చూసింది చెప్పి, "పైస కోసం అన్న పానీయాలను మానుకున్న వ్యాపారి ఇంట్లో దొంగతనం చేస్తే - ఆ దిగులుతో అతడు గుండె పగిలి ఛస్తాడు. తన మూలంగా ఇతరుల ప్రాణం పోవాలని కోరుకోడు చందు!" అన్నాడు.

అది విని ఆశ్యర్యపోయాడు చతురుడు.

అక్కడి నుండి నగరంలోకెల్లా అతి పెద్ద నగల వ్యాపారి ఇంటికి తీసుకువెళ్లాడు చందూని.

చందు లాఘవంగా ఆ వ్యాపారి ఇంట్లోకి ప్రవేశించి, ఒక నగల మూటతో బయటకు వచ్చాడు. ఆ మూటని చతురుడుకి అప్పచెప్పి మరోసారి దొంగతనం చేయడానికి మళ్ళీ లోపలికి వెళ్లాడు.

అంతవరకూ పరిచయంలేని తనని నమ్మి అంతటి విలువైన నగల మూట ఇచ్చినందుకు ఆశ్చర్యపోయాడు చతురుడు.

ఇంట్లో ప్రవేశించి చీకట్లో తడుముకుంటున్న చందు చేతికి ఒక జాడీ తగిలింది. 'అందులో ఏముందో..?' నన్న కుతూహలంతో లోపల చేయిపెట్టాడు చందు. మెత్తగా, తడిగా చేతికి ఏదో తగిలింది.

వెంటనే చేయి బయటకు తీసి, 'అది ఏమయ్యుంటుందా...?' అనుకొంటూ నాలుక మీద పెట్టుకున్నాడు. అది... ఉప్పు!

వెంటనే బయటకు వచ్చేసి, చతురుడు చేతిలోని నగల మూటను తీసుకుని తిరిగి లోపలికి తీసుకుపోయి యథాస్థానంలో వుంచేసి, ఖాళీ చేతులతో బయటకువచ్చాడు చందు.

అతడి వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోయి, "ఏమిటిది? " అని అడిగాడు చతురుడు.

"నేను ఈ ఇంటి ఉప్పుతిన్నాను. ఉప్పు తిన్న ఇంటికి ముప్పు ఎప్పుడూ తలపెట్టడు చందు!" అంటూ జరిగింది చెప్పాడు చందు.

అతడి నియమాలకు ఎంతో ఆశ్చర్యపోయాడు చతురుడు.

"ఈ చిన్న చిన్న వాళ్ళింటికి ఎందుకు? రాజుగారి కోటలోకి నన్ను తీసుకెళ్లు. అక్కడ ఘనంగా దోచుకుందాం!" అన్నాడు చందు.

"అవును... నిజమే! రాజుగారు పడుకునే శయ్య నాలుగు కాళ్ళక్రిందా నాలుగు పెద్ద పెద్ద బంగారు ఇటుకలను వుంచాడట. అవి దోచుకున్నా చాలు!" అంటూ రాజుగారి కోటవైపుకు దారి తీశాడు చతురుడు.

చందు, చతురుడు కలిసి రాజుగారి అంతఃపురం లోని శయ్యాగారంలోకి ప్రవేశించారు. ఆ చీకట్లో కూడా బంగారు ఇటుకలు ధగధగా మెరుస్తున్నాయి.

చందూని చూడగానే మంచం క్రింద నుండి ఒక కుక్క "భౌ... భౌ..!" మంటూ మొరుగుతూ వివిధ శబ్దాలు చేయసాగింది. దానికి ప్రతిగా మరో కుక్క కూడా మొరగసాగింది.

వెంటనే చందు- చతురుడి వైపు తిరిగి, "మహారాజా! తమను తోడుదొంగగా పొందగలిగిన ఈ చందు ధన్యుడు!" అంటూ రాజుగారి ముందు మోకరిల్లాడు.

తనని గుర్తించినందుకు చతురుడు ఆశ్చర్యపోయి, ఆ విషయం అడిగాడు.

"మహాప్రభూ! మనల్ని చూడగానే ఆ కుక్కలు మాట్లాడుకోసాగాయి. మొదటి కుక్క-'చందు రాజుగారి కోటనే కొల్లగొట్టడానికి వచ్చాడు... చూశావా?' అంది. రెండోకుక్క- 'తనతో మహారాజునేవెంటబెట్టుకు వచ్చాడు చూశావా!' అంది. దానిని బట్టి తమరిని గుర్తించాను" అన్నాడు చందు.

చతురుడు "చందూ... నీవు దొంగబ్రతుకు మానేయి ! నా స్నేహితుడిగా, సలహాదారుడిగా వుంటూ ఈ రాజ్యాభివృద్ధికి కృషి చేయి!" అన్నాడు చందు చేతులు పట్టుకుని.

అందుకు సంతోషంగా అంగీకరించాడు చందు.

లక్షణ రాజ్యం ప్రజలు లక్షణంగా కలకాలం జీవించారు.

★★★

